క్లుప్తంగా

చిరుధాన్యాలతో మానవాళికి మేలు



కాజ(మొవ్వ): చిరుధాన్యాలు మానవాళికి మేలు చేస్తాయని సైంటిస్ట్ డాక్టర్ నవీన్ కుమార్ చెప్పారు. మొవ్వ మండలం కాజలోని ఆర్‌బీకే కేంద్రంలో కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో శుక్రవారం చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల సైంటిస్ట్ డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ కృష్ణవేణి ముఖ్య అతిథులుగా హాజరై చిరుధాన్యాలతో తయారు చేసే పౌష్టికాహార పదార్థాల తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాజ వైస్ సర్పంచ్ మంద శ్రీనివాసరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జోగి రామచంద్రరావు, ఆర్‌బీకే చైర్మన్ పేకేటి సీతారామిరెడ్డి, పెద్దారాయుడు తోట ఎంపీటీసీ సత్యనారాయణ, వార్డు మెంబర్లు, రైతులు పాల్గొన్నారు.

నేడు 'ఉపాధి' ప్రజావేదిక

తోట్లవల్లూరు: ఉపాధి హామీ పనులు 2021–22కి సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తుంగల స్వర్ణలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు జరిగే ప్రజావేదికలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొనాలని కోరారు.

నేడు మొవ్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు

మొవ్వ: వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జేకేసీ కో ఆర్డినేటర్ కల్పన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ చైతన్య విద్యా సంస్థ సహకారంతో మొవ్వ కళాశాలలో ఉపాధ్యాయుల నియామక ఇంటర్వ్యూలు, డెమో, రాత పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ విద్యార్హత కలిగి, ఉపాధ్యాయ వృత్తిలో ఆసక్తి ఉన్నవారు శనివారం ఉదయం 10గంటలకు హాజరు కావాలని, వివరాలకు 9573778554లో సంప్రదించాలని సూచించారు.

రంజాన్ దీక్షలు ప్రారంభం



గుడివాడటౌన్: రంజాన్ ఉపవాస దీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని అన్ని మసీదుల్లో ముస్లింలు వేకువ జామున ప్రార్థనలు చేసి ఉపవాస దీక్షలు ప్రారంభించారు. ముస్లింలకు అతి పవిత్రమైన దీక్షలను నియమాలతో పాటిస్తామని వారు తెలిపారు. ప్రార్థనల్లో ముస్లిం నాయకులు షేక్ మౌలాలి, అబ్దుల్ షకూర్, అబ్దుల్ రిజియా, అబ్దుల్ గఫార్, మహ్మద్ రషీద్, షేక్ రిజ్వాన్, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్యామశాస్త్రి జయంతి వేడుకలు

గుడివాడటౌన్ : సంగీత త్రిమూర్తుల్లో ఒకరైన శ్యామశాస్త్రి 161వ జయంతి వేడుకలు శనివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్యామకృష్ణ గానసభ, త్యాగ బ్రహ్మ వైభవ ప్రకాశ సభ సంయుక్త ఆధ్వర్యాన సత్యనారాయణపురంలోని ఉపద్రష్ట సత్రంలో జరిగే జయంతి వేడుకల్లో సంగీత విద్వాంసులు సుధాకర్ గాత్ర సంగీతం ఉంటుందని పేర్కొన్నారు.

పులపర్రులో పంట కాల్వ తవ్వకం పనులు

మండవల్లి: మండలంలోని పులపర్రు గ్రామంలో పంట కాలువ తవ్వకం పనులను శుక్రవారం ఉపాధి హామీ పథకం కూలీలు చేశారు. ఈ సందర్భంగా ఎంటీఏ నవీన్ మాట్లాడుతూ పులపర్రు గ్రామంలో రూ.1.30 లక్షల నిధులతో పంట కాలువ తవ్వకం పనులను 56 మంది కూలీలు చేసినట్లు పేర్కొన్నారు.

పెరికెగూడెంలో పొలంబడి

మండవల్లి: పెరికెగూడెంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ సహాయ సంచాలకుడు జి.వెంకటమణి మాట్లాడుతూ మినుములో బంగారు తీగ ఉంటే మినుము నూర్చిన పొట్టును కాల్చేయాలని తెలిపారు. బంగారు తీగ లేని పొలంలో మినుము పొట్టును వేసుకోవడంతో నేలలో సేంద్రియ పదార్థం తయారవుతుందని ఏడీఏ పేర్కొన్నారు.

పోస్టల్ బీమా చెక్కు పంపిణీ

కైకలూరు: రూరల్ పోస్టల్ బీమా 28వ వార్షికోత్సవం సందర్భంగా కై కలూరు బ్రాంచి పోస్టాఫీసులో రూ.5,24,000 పోస్టల్ బీమా చెక్కును గుడివాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి శుక్రవారం పంపిణీ చేశారు. ఇటీవల మండవల్లి మండలం చింతపాడుకు చెందిన జయమంగళ బాబూరావు రూ.5 లక్షల పాలసీ ప్రారంభించాడు. కేవలం ఒక్క నెల మాత్రమే చెల్లించాక.. డెంగ్యూ జ్వరంతో మరణించాడు. దీంతో మొత్తం పాలసీ నగదును చెక్కు రూపంలో కుటుంబ సభ్యులకు అందించారు.

సమస్యల పరిష్కారానికే గ్రామదర్శిని

జిల్లా రిజిస్ట్రార్ టి.ఉపేంద్రరావు



పెదమద్దాలిలో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డెప్యూటీ కలెక్టర్ శివనారాయణరెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు

గుడివాడరూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహిస్తోందని జిల్లా రిజిస్ట్రార్ టి.ఉపేంద్రరావు అన్నారు. తటివర్రులో గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. తొలుత యూపీ పాఠశాలను సందర్శించారు. నాడు–నేడులో జరుగుతున్న పనులపై ఉపాధ్యాయులతో సమీక్షించారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతా ప్రమాణాలపై విద్యార్థులతో స్వయంగా మాట్లాడారు. నాణ్యమైన భోజనం అందించాలని కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులు, ఉపాధ్యాయులకు ఆదేశాలు ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి తల్లులు, పిల్లలకు కేంద్రం ద్వారా అందుతున్న పథకాలపై ఆరా తీశారు. గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి పంచాయతీ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. చెత్త నుంచి సంపద వెలికి తీయడానికి ఏర్పాటైన సంపద కేంద్రాలను వినియోగించుకుని పంచాయతీలు ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్నారు. రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించి ప్రజలకు క్లోరినేషన్ చేసిన నీటిని అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఓవర్ హెడ్ ట్యాంక్‌ను శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ దేవరపల్లి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఆర్వీ కృష్ణ, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెదమద్దాలి(పామర్రు): సమస్యల పరిష్కారానికి గ్రామదర్శిని ఉపయోగపడుతుందని జిల్లా డెప్యూటీ కలెక్టర్ బి.శివ నారాయణ రెడ్డి అన్నారు. పెదమద్దాలి గ్రామంలో ఆయన శుక్రవారం గ్రామదర్శిని నిర్వహించారు. గ్రామ సచివాలయ సిబ్బందితో ముఖాముఖి సమీక్ష సమావేశం నిర్వహించి వారితో మాట్లాడి వారు ప్రజలకు చేయాల్సిన పనులు విధులు వివరించారు. అనంతరం గ్రామంలోని హెల్త్ కేర్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ అందుతున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందుతోందా లేదా అనే విషయాలు తెలుసుకుని మెనూ ప్రకారం వండిన పదార్థాలు రుచి చూశారు. డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అన్ని రకాల వసతులు కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ విజయ్‌కుమార్, వీఆర్వో ప్రదీప్, గ్రామ కార్యదర్శి సోమేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య సిబ్బంది పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మకూరులో గ్రామంలోని సచివాలయం, ఆర్‌బీకే, వెస్‌నెస్ సెంటర్‌లను సర్వే ఏడీ ఎస్ గోపాల రాజు పరిశీలించారు.

■ పెరిశేపల్లి గ్రామాన్ని ఉయ్యూరు ఆర్డీవో ఎస్.విజయ్‌కుమార్ పరిశీలించి గ్రామస్తుల నుంచి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సచివాలయ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. జగనన్న కాలనీలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, పాఠశాలలో మధ్యాహ్న భోజనం సక్రమంగా అమలు జరిగేలా చూడాల్సిన బాధ్యత సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లపై ఉందని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, సర్వే విభాగం డిప్యూటీ తహసీల్దార్ వి.గంగాధర్, కార్యదర్శి పద్మశ్రీవేణి, మహిళా సంరక్షణ కార్యదర్శి వసంత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. రాపర్ల గ్రామాన్ని జిల్లా వాటర్ రిసోర్సు ఆఫీసర్ కె .శ్రీనివాసరావు పరిశీలించారు. గ్రామంలోని సచివాలయం, నిర్మాణంలో ఉన్న ఆర్‌బీకే వెల్‌నెస్‌సెంటర్లు చూశారు. కార్యక్రమంలో వీఆర్వో పూర్ణ ప్రసాద్, కార్యదర్శి మురళీకృష్ణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పామర్రు(పమిడిముక్కల): పమిడిముక్కల మండలం ఐనంపూడి గ్రామంలో శుక్రవారం డీఎల్‌పీవో జి.సంపతి కుమారి పర్యటించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలవుతున్న తీరు పరిశీలించారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులను కల్పించి త్వరలో ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి కేంద్రం ద్వారా పంచాయతీకి ఆదాయ వనరులు కల్గించాలని చెప్పార. కార్యక్రమంలో సర్పంచ్ ఏనుగ బేబీ, ఎంపీటీసీ, మండల వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, గ్రామ కార్యదర్శి మాగంటి విజయదుర్గ, సెక్రటరీ సుమంత్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సాంకేతిక విద్య

గుడ్లవల్లేరు: ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ పి.సీతాపతిరావు అన్నారు. గ్రామదర్శినిలో భాగంగా శుక్రవారం గుడ్లవల్లేరు మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్నతాధికారులు ప్రత్యేకాధికారుల హోదాలో పర్యటించి ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, మంచినీటి పథకాలు, గృహ నిర్మాణాలతో పాటు సచివాలయాలు పరిశీలించారు. గుడ్లవల్లేరులో సీతాపతిరావుతో పాటు కూరాడలో గుడివాడ ఏడీఏ ఎస్.రమాదేవి, పెంజెండ్రలో బంటుమిల్లి ఏడీఏ బి.గౌతమ్, వడ్లమన్నాడులో డెప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ యు.వి.సుబ్బారావు గ్రామదర్శినిలో పర్యటించి పరిశీలించారు. ఈ పర్యటనలో ఎంపీడీఓ వి.దిలీప్‌కుమార్, తహసీల్దార్ అబ్దుల్ రెహ్మాన్ మస్తాన్, వ్యవసాయ సలహా కమిటీ జిల్లా డైరెక్టర్ పెన్నేరు ప్రభాకరావు, సర్పంచి కటికల జ్యోతిలత, గ్రామ కార్యదర్శులు ఉమామహేశ్వరరావు, నరసింహారావు, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయను నివారిద్దాం



ర్యాలీ ప్రారంభిస్తున్న డాక్టర్ ఇందిరాదేవి

గుడివాడటౌన్ : టీబీ ప్రాణాంతకం కాదని దాన్ని నియంత్రించవచ్చని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఇందిరాదేవి అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం వైద్యులు, వైద్య సిబ్బంది టీబీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది, ఎన్జీఓస్ అసోసియేషన్ గుడివాడ యూనిట్ అధ్యక్షుడు షేక్ ఫరీద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: క్షయ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తోట్లవల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న తెలిపారు. తోట్లవల్లూరులో ఆరోగ్య సిబ్బంది శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మాధవి, ఎంపీహెచ్ఈఓ మాణిక్యం, హెచ్‌వీ రోహిణి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కైకలూరు: క్షయ రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ అడవి కృష్ణ చెప్పారు. క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా కైకలూరు ప్రాంతీయ ఆరోగ్య కేంద్రం నుంచి ఆరోగ్య సిబ్బంది శుక్రవారం ర్యాలీ చేశారు. కైకలూరు టీబీ పర్యవేక్షణాధికారి వినయ్, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, వైస్ ఎంపీపీ జహీర్, బలరామరాజు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేతో రైతులకు మేలు



డ్రోన్ ఫ్లై ప్రారంభిస్తున్న ఎంపీపీ రాజామణి, తహసీల్దార్ వెంకటశివయ్య

తోట్లవల్లూరు: భూముల రీసర్వేతో రైతులకు మేలు కలగనుందని తోట్లవల్లూరు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి అన్నారు. జగనన్న సంపూర్ణ భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా శుక్రవారం స్థానిక సౌత్ వల్లూరులో డ్రోన్ ఫ్లై కార్యక్రమం జరిగింది. రీసర్వేతో భూవివాదాలు తొలగటంతోపాటు భూములకు శాశ్వత హద్దులు, హక్కులు లభిస్తాయని రాజామణి చెప్పారు. సౌత్‌వల్లూరులో మూడు వేల ఎకరాల్లో డ్రోన్ ఫ్లై నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య తెలియజేశారు. భద్రిరాజుపాలెం సర్పంచ్ కొక్కిలిగడ్డ హేమలత, ఉప సర్పంచ్ చాగంటి తిరుమలరెడ్డి, మండల సర్వేయర్ సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి పుష్పనాథం, వీఆర్వో బండి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



పోషకాహారంపై అవగాహన కలిగిస్తున్న అంగన్‌వాడీలు



పెంచికలమర్రు అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతూ సీడీపీవో ఆనంద్

పామర్రు: పౌష్టికాహారాన్ని ప్రతి రోజూ తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సీడీపీవో భానుశ్రీ అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాలపై ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయకుమారి, ఏఎన్ఎం నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: గర్భిణులు, బాలింతలు, బిడ్డ తల్లులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహార పదార్థాలు తయారు చేసుకోవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇ.వాణి అన్నారు. కౌతవరంలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు శుక్రవారం 'పోషణ్ పక్వాడా' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం వాణి, సచివాలయ ఎంఎస్‌కే సుధారాణి, అంగన్‌వాడీలు బి.రజనీకుమారి, కె.నాగమణి, టి.నాగమణి, ఎం.శశికుమారి, జె.వి.వి. కుమారి తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: మండలంలోని లోకుమూడి, చావలిపాడు గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పౌష్టికాహార పక్షోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చావలిపాడులో సర్పంచ్ తలారి ధనలక్ష్మి, అన్నిబాబు, సీడీపీఓ ఆనంద్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సూపర్‌వైజర్ కల్పవల్లి ఆరోగ్యపరమైన అంశాలపై వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చెల్లమ్మ, ఆర్‌వీ రమణ, ఎం.వెంకటేశ్వరమ్మ, ప్రసన్నకుమారి, పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు: చిరుధాన్యాలతో చక్కటి ఆరోగ్యం దక్కుతుందని ఐసీడీఎస్ కై కలూరు ప్రాజెక్టు సీడీపీవో బి.ఆనంద్ చెప్పారు. పెంచికలమర్రు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాల్లో లభించే పోషక విలువలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కలిగించారు. గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఫాతిమాఖానం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. వింజరం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ధర్మరాజుల నాగమణి, వీఆర్వో రవితేజ ఆధ్వర్యంలో అవగాహన కలిగించారు.

నేడు మున్సిపల్ షాపుల అద్దెకు వేలం

గుడివాడటౌన్: గుడివాడ పురపాలక సంఘ పరిధిలోని ఎస్పీఎస్ నార్త్‌బ్లాక్‌లోని ఆరు షాపుల అద్దె బహిరంగ వేలం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్పీఎస్ నార్త్‌బ్లాక్‌లోని మొదటి అంతస్తులో 1ఎ, 2ఎ, 16ఎ, 25ఎ, 40ఎ, 41ఎ షాపులు వేలం వేస్తారని వివరించారు. ఆసక్తి ఉన్నవారు బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు.


నేడు తోట్లవల్లూరుకు ఎంపీ బాలశౌరి రాక

తోట్లవల్లూరు: మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి శనివారం మండలకేంద్రమైన తోట్లవల్లూరుకు వస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక కలాసుమాలపల్లిలో నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను మధ్యాహ్నం 3 గంటలకు పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించనున్నారని పేర్కొన్నారు.

■ మొవ్వ: మొవ్వ మండలం కోసూరులో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం జరుగుతుందని బందరు ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు రాజులపాటి రాఘవరావు తెలిపారు.

■ పామర్రు: స్థానిక జెడ్పీ హైస్కూల్ పక్కనే ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు నూతన హాస్పిటల్‌లకు అవసరమైన నూతన పరికరాలను ప్రారంభిస్తారని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ శుక్రవారం అన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాల శౌరి, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పాల్గొంటారన్నారు.

పశువుల్లో గాలికుంటు నివారణకు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న లక్ష్మీనారాయణ

గుడివాడరూరల్: పశువుల్లో వచ్చే గాలికుంటు నివారణకు టీకాలు ఉచితంగా వేసే కార్యక్రమాన్ని ఈనెల 25 నుంచి ఏప్రిల్ 24వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. మోటూరు పశువైద్యశాలలో గాలికుంటు నివారణ టీకాలను పశువులకు వేసే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ వైద్యులు వేణు, పశు సంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం



సాంస్కృతిక కార్యక్రమాల్లో 'వీకేఆర్' విద్యార్థులు

గుడివాడటౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల 15వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఉన్నత విద్యాశాఖ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్యను గుడివాడ పరిసర ప్రాంత ప్రజలకు చేరువ చెయ్యాలనే లక్ష్యంతో దివంగత కరస్పాండెంట్ వేములపల్లి వెంకటేశ్వరరావు ఈ సంస్థను ఏర్పాటు చేశారన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ది గుడివాడ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణ వీరయ్య(బాబ్జి) బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ వేములపల్లి కోదండ రామయ్య, డైరక్టర్ కల్యాణ్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు, పాలకవర్గ సభ్యులు బొగ్గారపు తిరుపతయ్య, బి.దివాకర్, జాస్తి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధి కోరుతూ సీఎం జగన్‌కు వినతి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో మోర్ల రామచంద్రరావు, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: మండలంలో రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేసినట్లు రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మర్రెడ్డి శిల్పారెడ్డి తెలియజేశారు. అసెంబ్లీలో శుక్రవారం సీఎం జగన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నట్లు ఆమె చెప్పారు. ముఖ్యంగా పెనమకూరులో పీహెచ్‌సీ నిర్మాణం, బందరుకాలువపై వంతెన మంజూరు కోసం, రోడ్ల అభివృద్ధికి వినతిపత్రం అందజేసినట్లు శిల్పారెడ్డి తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

■ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కృష్ణాజిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు మోర్ల రామచంద్రరావు శుక్రవారం అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌తో కలిసి తనను జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులుగా నియమించినందుకు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఐదు కేజీల రిబేటు రద్దు చేయాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే డీఎన్నార్



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: చేపల ఉత్పత్తి రవాణాలో వ్యాపారస్తులు నిర్ణయించిన క్వింటాకు 5 కేజీల చేపల రిబేటును తక్షణం రద్దు చేయాలని కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అసెంబ్లీ చర్చలో ఆయన మాట్లాడుతూ ఒక లారీలో 14 టన్నుల చేపల లోడింగ్ జరుగుతుందన్నారు. ఇందులో 700 కేజీలు రిబేటుగా ట్రేడర్ చేపలను తీసుకుంటున్నారన్నారు. దీంతో లారీ లోడుకు దాదాపు రూ.70,000 నుంచి రూ.లక్ష రైతు నష్టపోతున్నాడన్నారు. దీంతో కృష్ణ, ఉభయగోదావరి జిల్లాల్లో రూ.కోట్లలో ఆక్వా రైతులకు నష్టం జరుగుతోందన్నారు. రిబేటు సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. మత్స్యశాఖ మంత్రి ప్రత్యేక దృష్టి సారించి జీవో తీసుకురావాలని కోరారు. ఆక్వా రైతులకు న్యాయం చేస్తూ నిర్ణయం తీసుకోవాలని కోరారు. విద్యుత్‌శాఖ సిబ్బంది రైతుల నుంచి సబ్సిడీ పోను కరెంటు చార్జీలు కట్టించుకుని ఇప్పుడు పూర్తిగా చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. రైతులను ఇబ్బంది పెట్టవద్దని విద్యుత్ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

బ్యాంకు మిత్ర సర్వీస్ పాయింట్లపై అవగాహన



సర్వీసు పాయింట్లపై అవగాహన కల్పిస్తున్న ఐబీ మేనేజర్ దుర్గారావు

మండవల్లి: బ్యాంకుల్లో మాదిరిగానే బ్యాంకు మిత్ర సర్వీస్ పాయింట్లలో లావాదేవీలు జరుగుతాయని ఇండియన్ బ్యాంకు మేనేజర్ బొంతు దుర్గారావు పేర్కొన్నారు. స్థానిక ఇండియన్ బ్యాంకులో శుక్రవారం బ్యాంకు మిత్రలకు ప్రజలకు అందించాల్సిన సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మేనేజర్ మాట్లాడుతూ గ్రామాల్లోని సామాన్య ప్రజలకు బ్యాంకు సేవలు అందించటానికి భైరవపట్నం, ఆనందపురం, అయ్యవారిరుద్రవరం, గన్నవరం, పెరికెగూడెం గ్రామాల్లో బ్యాంకు మిత్ర సర్వీసు పాయింట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పాయింట్లలో కొత్త ఖాతాలు, జీపీఎఫ్ ఖాతాలు, మోటారు బీమా, జీవిత బీమా, రూ.20 వేల వరకు నగదు జమ, రూ. 10 వేల వరకు ఉపసంహరణ(విత్‌డ్రా) ఏ బ్యాంకు ఖాతా నుంచైనా చేసుకోవచ్చన్నారు. ఈ పాయింట్లు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయన్నారు. కార్యక్రమంలో బ్యాంకుమిత్రలు ఎస్.జోజిమేరి, ఐ.ఝాన్సీరాణి, సీహెచ్ కల్యాణి, ఎం.జాస్మిన్, జి.మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఏఎన్నార్ కళాశాల అభివృద్ధికి రూ 2.50 లక్షల వితరణ



వితరణ చెక్కును అందజేస్తున్న వెంకట రమణ

గుడివాడటౌన్ : విలువలతో కూడిన పాలనను ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ ఎర్నేని వెంకటేశ్వరరావు చేశారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు అన్నారు. కళాశాల సమావేశం హాలులో శుక్రవారం జాతీయ సైన్స్‌డే పురస్కరించుకుని కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఎర్నేని వెంకటేశ్వరరావు కుమారుడు వెంకట రమణ కళాశాల అభివృద్ధికి రూ 2.50 లక్షలు వితరణతో పాటు విలువైన పుస్తక సంపద కళాశాలకు అందజేశారు. ఈ సందర్భంగా కేఎస్ అప్పారావు మాట్లాడుతూ అప్పట్లో విదేశాల్లో నివస్తున్న వెంకటేశ్వరరావు కళాశాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారన్నారు. సాధారణ కళాశాలగా ప్రారంభమైన ఏఎన్నార్ కళాశాల పీజీ స్థాయికి ఎదగడానికి వెంకటేశ్వరరావు చేసిన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శివనాథ్, గ్రంథాలయ అధికారిణి బీఎస్ఎస్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం – ఇలపర్రు, నందివాడ మండలం

తేది: 23-03-2023 | టెండరు ప్రకటన | ఆర్. సి. నెం: 07/2023

[illegible]

క్ర.సం.	పని వివరము	సంఖ్య	కాలపరిమితి	ధరావతు
1)	[illegible]	2	ది. 01-04-2023 నుండి ది. 31-03-2024 వరకు	రూ.1,000/- [illegible]
2)	[illegible]	1	ది. 01-04-2023 నుండి ది. 31-03-2024 వరకు	రూ.1,000/- [illegible]
3)	[illegible]	1	ది. 01-04-2023 నుండి ది. 31-03-2024 వరకు	రూ.1,000/- [illegible]

[illegible]

గ్రామ పంచాయతీ కార్యాలయము, వడ్లమన్నాడు

టెండరు ప్రకటన

[illegible]

క్ర.సం	పని వివరము	కాలపరిమితి	ధరావతు
1	[illegible]	1-04-2023 to 31-03-2024	3000/-
2	[illegible]	1-04-2023 to 31-03-2024	3000/-
3	[illegible]	1-04-2023 to 31-03-2024	3000/-

[illegible]

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

గుడివాడ డివిజన్

99516 02865 (గుడివాడ)

99516 02985 (కైకలూరు)

90105 77706 (పామర్రు)

Office mail : sakshiads@gmail.com